బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

**అభయం**

ఒకసారి బాబా భక్తులందరినీ దరిచేర్చుకుని దయ, జాలి, ప్రేమ అనేవి మానవులు ఏ విధంగా ఎదుటి వారిపై చూపాలి, ఆచరించాలి అనే విషయంపై బోధన చేస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో శేషు అనే వ్యాపారి ఒకతను బాబా వద్దకు వచ్చి నమస్కరించి ఆశీర్వాదం పొంది "బాబా! పిల్లకి సంబంధం వచ్చింది. పొరుగూరు వెళ్ళి మాట్లాడి అన్ని విషయాలు తెల్సుకుని రావాలి. ప్రస్తుతం తల్లీకూతుళ్ళు మా అన్నగారింట్లో ఉన్నారు" అంటూ సందేహిస్తూ మాట్లాసాగాడు.

దానికి బాబా నవ్వి - "వెళ్ళిరా నాయనా! సందేహం, సంకోచం దేనికి? శుభం వెళ్ళిరా!" అంటూ ఆశీర్వదించి విభూదిపొట్లం యిచ్చారు.

అయినా అతను కదలక "బాబా! ఊళ్ళో అసలే దొంగల బెడద ఎక్కువగా ఉంది. పెళ్ళి తాలూకు నగలు, డబ్బు ఇంట్లో వున్నాయి. తీరా తాళంవేస్తే దొంగలకి అవకాశం యిచ్చినట్లవుతుందేమోనని భయంగా ఉంది. ఎటూ తోచటంలేదు" అన్నాడు బాధగా.

"అదా నీ బాధ. దొంగలకి భయపడి ఎన్నాళ్ళు నీ పని వాయిదా వేసుకోస్తుంటావు? ఏం పర్వాలేదు, ఈ బాబా మీద భారం మోపి వెళ్ళిరా, అంతా శుభం - జయం కలుగుతుంది" అన్నారు అభయం యిస్తూ.

ఆ తర్వాత అతను వెళ్ళాడు. బాబా బోధన ముగించి మండువాకి వెళ్ళారు.

ఆ రాత్రి వ్యాపారి అనుకున్నట్లుగానే దొంగలు అతని యింటికి గల తాళం చూసి వచ్చారు. తాళం పగలగొట్టసాగారు. మండువా నుంచి వస్తున్న బాబా అది గమనించి దూరంగా ఉన్న చెట్టుకింద కూర్చున్నారు. దొంగలు తాళాన్ని బలంగా కొడ్తూ పగలుకొట్టసాగారు. బాబా దూరం నుంచి చూస్తున్నారు. తన కళ్ళ నుంచి వెలుగులు సూర్యకాంతిలా వచ్చి ఆ తలుపులపైన, దొంగలపైన పడ్డాయి. "ఎవరో వస్తున్నారు. మన మీద లైటువేసి మరీ చూస్తూ వస్తున్నారు. పదండర్రా పారిపోదాం" అంటూ దొంగలు ఒకరితో జొకరు అనుకుని పరుగెత్తారు తలోవైపున. బాబా అలాగే తెల్లారే వరకూ గడిపి మసీదు చేరారు.

ఆ మర్నాడు వ్యాపారి వచ్చి తన యిల్లు యథావిధిగా ఉండి దొంగలపాటిట పడనందుకు ఆనందించి బాబాని దర్శించి ఆశీర్వాదం అడిగాడు.

తాను వెళ్ళిన పని జయం అయినదని చెప్పగా, బాబా "ఏమైతేనేం నీ యిల్లు కాపలా కాస్తానని మాటిచ్చినందుకు నేను శ్రమపడ్డాను మరి!" అన్నారు నవ్వుతూ.

వ్యాపారి నొచ్చుకున్నాడు బాబాని శ్రమపెట్టినందుకు. "ఏం పర్వాలేదు. భక్తుల రక్షణము, నా రక్షణము నా బాధ్యత కాదా!" అన్నారు.

సాయి దయామయుడు, కరుణామయుడు. భక్తులకోసం ఎంత కష్టాన్నయినా తాను భరించి, వారికి మేలు కలిగిస్తారు. కాంతి కిరణాలను ప్రసరింపజేసి తన మహిమను చూపి వ్యాపారిని, అతని ఇంటిని కాపాడి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సాధుసమానుడు.